# శవం నడిచి వెళుతుంది

అది శవం —

అది కళ్ళు తెరవ గలిగేప్పుడు అతని పేరుకు ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు !

దొర అనే వారు, దాత అనేవారు ; మంచి వాడూ, తెలివిగల వాడూ అని అనే వారు. మరిప్పుడు కళ్లు మూసుకున్నాడన్న ధైర్యంతో అందరూ 'పీనుగ' అంటున్నారు.

ఉదయం ఓసారి ఆరు గంటలకు గాలి ప్రపంచం మీదికి వదిలి, మళ్ళీ పిల్చలేదు —

ఆ శవం నడవ గలిగేటప్పుడు — నడవలేదు. కార్లల్లో తిరిగేది — దప్పికైతే నీళ్లు కాదు - బ్రాందీ తాగేది.

కాని గుండెలో వెన్నుండేది — జేబులో డబ్బుండేది.

అవసరముందని అడిగే వాళ్ళకు పంచిపెట్టేది —

ఆయన హయాంలో ఎవరికీ కాళ్ళకు ముళ్లు విరిగేవి కావు. గుడ్డి వెలుగుకు కళ్లు పీక్కుపొయ్యేవీ కావు. రోగాలొచ్చి నిలిచేవీ కావు. — ఆయనేం మంత్ర కాడు కాడు. కానీ అవన్నీ కల్పించేందుకు మానవ ప్రయత్నం చేసి విజయం పొందాడు. ఫలితంగా అక్కడి ప్రజలు కష్టాలను వెళ్ళగొట్టేశారు —

మాట్లాడ గలిగేటప్పుడు వేలమంది వచ్చి కలిసి పొయ్యేవారు. చాలా మంది ఆయన ముందు నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడేవారు. కొందరు మాట్లాడ్డానికి జంకే వారు —

మాట్లాడటం లేదని తెలియగానే ఎందుకో పదంతలమంది పరుగెత్తుకు వచ్చి గోలచేస్తున్నారు. ఏడుస్తున్నారు. బొబ్బలు పెడుతున్నారు. కొందరు మాత్రం కన్నీళ్లు విడుస్తున్నారు.

శవాన్ని వర్ణించాలనుంది. అందుకే పూలను వర్ణిస్తాను —

బ్రతికున్నప్పుడు అప్పుడప్పుడు పూలదండ లేసేవారు — ఇప్పుడు కనిపించకుండా పూలలోనే ఆయన్నుంచేశారు.

'అదో పెద్ద ప్యాలెస్'. అది ఆయనింటి పేరని తెలియకున్నా, దాన్ని చూసిన ప్రతివాడూ ఆమాట అనకుండా ఊరుకోడు —

అందులోని ముందు వరండాలో పెద్ద పూల పాన్పు మీద పవ్వళించి ఉన్నాడు —

'నలుదిక్కుల సువాసన లందిస్తూ శవం కంపును పీల్చి నల్లబడి కుళ్లాలి' - అని రాసుంది అన్ని వేల పువ్వుల ఖర్మలో అనాడు —

నిన్న సాయంత్రం ఆ సమయానికి తన యజమానిని ఎక్కడెక్కడెన్ని సుందర ప్రదేశాలు తిప్పిందో తీరిగ్గా నెమరేస్తుంది పదిహేనడుగుల పచ్చ ప్లిమథ్ —

ఏడ్చి ఏడ్చి నిద్రలో జోగుతున్న పసిపాపను గుర్తుకు తెస్తోంది ఓమూల కట్టి వేయబడిన అల్సేషియన్ డాగ్. దాని మూసిన కళ్ల నుండి వదను జారి ఎక్కడో అదృశ్యమై పోయింది.

ట్యూబ్ లైట్లు తెల్లగా – పేలవపు విషాదం కురుస్తున్నాయ్. వరద లొచ్చి సర్వస్వం కోల్పోయినట్లు – అందరివి దివాలా తీసిన ముఖాలు. అందులో కొన్ని వత్సరాలైనా తేరుకోలేనివి కొన్ని.

కుమిలి కుమిలి కార్జ్యం కమిలేట్లు ఏడుస్తున్నాయ్ – ఎదురు గదిలో —

"అదిగో వారే వీరి భార్యా పిల్లలూ" — చూసి వెళ్లే వాళ్లంటున్న మాటలు గాలిలో ఎగురుతున్నాయ్ —

కొన్ని నెలల వరకు ఆ దుస్సంఘటన మరిచిపోలేని మరికొన్ని ముఖాల బృందాలు — ఆప్త మిత్రులూ, బంధువులూ బహుశ!

కొన్ని ముఖాల్ని బయటికి పిలిచి జోక్ వేస్తే పగలబడి నవ్వగలిగి. హంగామా చెయ్యగలవి కూడా ఉన్నాయ్ — ఆయన పరిచయస్తులవి. ఆయన సహాయం పొందని వారివి.

శవం చచ్చినా ఓపిక చావలేదు. ఎందరొచ్చినా రిసీవ్ చేసుకుంటోంది. పూల మాల కప్పుకుంటోంది. వచ్చేవాళ్లు. పొయ్యేవాళ్లు ఒకటే రద్దీ — అతను బ్రతికున్నప్పుడు —. అతుక్కు పోయిన డొక్కలెన్ని విప్పాడు - పడిపొయ్యే వాళ్ళ నెందర్ని లేబట్టాడు - ఎందరికి దారులు చూపించాడు —. ఎందరి కలలు పండించాడు — అనేవి సామాన్యంగా తెలియవు. చాలా లెక్కలు చేయాలి. అయినా ఇక్కడ ఆయనపై ప్రత్యేక వ్యాసం వ్రాయడం లేదు గనకా, వ్రాసినా చదువుకొని సంతోషించే అనుభూతి ఆయనకు లేదు గనకా, అవన్నీ అనవసరం —

ముఖ్య విషయ మేమంటే దాదాపు వాళ్లందరూ వచ్చారు. ... వాళ్ల బోధల ఫలితాలను జేబురుమాళ్ళు, చొక్కా కొనలు, పైట చివరలు భరిస్తున్నాయి.

ప్యాలెస్ బయట సూర్యుడు ప్లేటు ఫిరాయించాడు. వెలుగు కిరణాలను గింజుకొని, చీకటి కిరణాలను ప్రసరిస్తున్నాడు అవి లైట్లు చీకట్లతో పోరాడుతున్నాయి.

ప్యాలెస్ లోపల రద్దీ అధికమైంది. వాతావరణం చల్లబడుతోంది — నీలాకాశం బూడిద రంగయింది — శవాన్ని తీసికెళ్ళేందుకు ప్రయత్నాలు పూర్తయ్యాయి. బ్యాండ్ వాయిద్యాలు అమోఘంగా, ఘనంగా మ్రోగుతున్నాయి. ముఖ్యమైన వాళ్లు శవాన్ని లేపి భుజాలపై ఉంచుకొని, తమ కర్తవ్యం తాము నిర్వహిస్తున్నామనే సంతృప్తితో అడుగులు వేస్తున్నారు.

అదొక వేడుక - వైభవం. ఊరేగింపులాగా వుంది — చౌరస్తా చేరి మలుపు తిరుగుతోంది.

దేవుణ్ణూరేగిస్తున్నారో, లేక పెండ్లో, ఏ మత గురువు నూరేగించడమో అనుకొని ఆశలు, ఆకాంక్షల జ్యోతులు వెలిగించుకొని పరిగెత్తుకుంటూ బంగళా బాల్కనీలల్లో కొచ్చి చూసి, కళ్ళలోని జ్యోతుల కళ్ళు ఆర్పేసుకొని మొహం తిప్పుకొన్నారు కొందరు. కొందరు తలుపు లేసుకున్నారు.

శవం మనస్సు చివుక్కుమంది —

ఏం? ఎందుకూ — నా తప్పేముందిందులో. ప్రతిజీవి ఆఖరిస్థితి ఇదే కదా!

శవం ముఖంలో గంభీరత చోటు చేసుకుంది.

దూరంగా గుడిసెలోంచి వచ్చిన చిన్నపిల్లలు చప్పుళ్లను, లైట్లను చూసి నవ్వుతూ చప్పట్లు చరుస్తున్నారు.

వాళ్ళు దేవుళ్ళు - వాళ్ళే శవాన్ని ఆశీర్వాదిస్తున్నారో, లేక శవమే సంతోషం పొంది పసివాళ్ళను దీవిస్తుందో—ఏమో, ఏదో, గాని—.

శవం పెదాలపై చిరునవ్వు చోటు చేసుకుంది—

మరో నాలుగురోడ్ల కూడలి కూడా దాటిపోయింది. ఎన్ని దాటుకుంటూ మనిషొచ్చాడో, మళ్లీ అన్ని దాటుకుంటూ వెళ్ళాలి కాబోలు.

ఎలా చచ్చేడు? ఎందుకు? ఎప్పుడు?

అర్థంలేని ప్రశ్నలు - జవాబులు, లోకానివి అక్కడక్కడ గాలికో కలుస్తున్నాయ్.

అసలీ లోకానికెందు కివన్నీనూ?

మనిషి ప్రశాంతంగా ఉంటే లోకం పూరుకోదు - బహుశ మనిషిబ్రతికున్నంతకాలం అనేక రోగాలు, గాలి పీల్చటం - వదలడం, గుండె లబోదిబోమని మొత్తుకోవడం-వళ్ళు పులకించడం - తిమ్మిరెక్కడం....ఎన్నో

అవన్నీ నయమయ్యా యన్నాడు డాక్టరు.

హాయిగా ఉన్న వాణ్ణిచూసి ఎందుకంత ఇది....?

ఆ కాస్త శాంతితోనైనా బూడిద కానీయరు కాబోలు.

వాతావరణం చల్లగా మంచులా మారింది, చినుకులు మొదలయ్యాయి. పెద్దగా, చెవులపై ఆశలు వదులుకునేట్లుగా ఉరుములు ఉరిమాయి. మరో మూడునిమిషాల్లో స్ట్రీట్ లైట్సన్నీ కళ్ళు మూసుకున్నాయి. వాతావరణ పరిస్థితులు చెడిపోవడంవల్ల, త్వరగా గమ్యంచేరి కర్తవ్యం నిర్వహించాలన్న తాపత్రయం అందరిలోనూ ఉంది.

పూలమీద పరిచిన ఒక్క శరీరం కోసం ఎన్ని శరీరాలు ...?

ఒక్కడు గాలి పీల్చకపోతే ఎందరు ఎగదమ్ము పోస్తున్నారు?....గమ్యం ఇంకో నూడుఫర్లాంగులుండగా మరో చౌరస్తా కలిసింది. చౌరస్తాలో ఆందోళన కారులు. పోలీస్వ్యాన్లు - భాష్పవాయువు, అన్నీ కూడా కలసినట్లున్నాయి ఊరేగింపులో —

"ఇక్కడ ఫైరింగవుతోంది - పారిపోండి"

ధన్....ధన్....ధన్— అమ్మా!, అబ్బా!

మనుషుల అడుగుల చప్పుడు - వెంబడిస్తూ—

పోలీసు బూట్ల చప్పుడు - తుపాకీ కాల్పులు.

బొబ్బలు - కేకలు - కీకలు.

ఊరేగింపు బిగువు సడలించి.

ఆందోళనకారు లెవ్వరో, ఊరేగింపు వాళ్ళెవ్వరో, పోలీసులు గుర్తుపట్టడంలేదు - ఫైరింగ్ - పరుగు - ఫైరింగ్.

"ప్రాణాపాయం"-పోలీసు వ్యాన్లు ఎటు నుండి ఎటో? కళ్ళుకనిపించడం లేదు - గుండెలు ఊడిపోతున్నట్టు భయం - తుపాకి దెబ్బ! —సందులగుండా పరుగు.

అది మత కలహాన్నణచడమో - విద్యార్థుల అల్లర్లను అరికట్టడమో - రాజకీయ ముఠాలను మట్టుపెట్టడమో, గుండాలను గుప్పిట్లో నుంచుకోవడమో ఏదో - ఏమో - ఎవరూ అసలు విషయం తెలుసుకోవడంలేదు. తెలిసినా గుర్తు చేసుకోవడంలేదు - ఒక్కటే తెలుసు-పరుగు-ప్రాణం రక్షించుకోవాలి!

ఆఖరిసారిగా శవానికి తమ వినయ విధేయత చూపించుదామని, వచ్చిన ఎందరో బంధువులు స్నేహితులు, ఆత్మీయులు చాలా చాలా మంది తమ శరీరాలను బాధలపాలుచేయడం ఇష్టంలేని వాళ్ళు, తను ప్రాణాల్ని శవప్రాణాల్తో కలుపలేక సురక్షిత ప్రాంతాలకై పరుగులు పెట్టారు.

వాన మరీ అధికమయింది - శవం అడుగుల ముద్రలు వేయించుకుంది. తుపాకిదెబ్బలు - అరుపులు-వర్షం హోరు - వ్యాన్‌ల జోరు - హారన్లు బ్రేకుపడక 'కీచ్'-తుపాకి దెబ్బ, ఢాం........

అంతా నిశ్శబ్దం-వానహోరు, గాలిజోరు తప్పించి - శవం వెంట తెచ్చిన లైట్లారిపోయ్యాయి - పగిలి! - చెవులు పగిలేలా బాకా లూదిన భజంత్రీగాళ్ళు ఎక్కడున్నారో, ఈ అంధకారంలో వర్షంలో గుర్తుపట్టడం కుదురదు—

అల్లరి మూకను చేజిక్కించుకో చేతకాకపోయినా ఒక్కొక్క పోలీస్ అలెగ్జాండర్‌లా ఫీలవుతున్నాడు,

అంత వర్షంలోనూ - దూరంగా తుపాకిదెబ్బలు ఢాం....ఢా! అడుగులు అమ్మా - ! కేకలు....నిశ్శబ్దం. ..

శవం ఆలోచిస్తుంది - ఏడుస్తుంది.

తనెంత సహాయపడ్డాడు లోకానికి ? - ఎందరికి తన ప్రాణాలిచ్చాడు? అందరూ కలిసి నా ఆఖరు కార్యక్రమాన్ని సరిగ్గా జరుపలేక పొయ్యారు. పాడులోకం - అంతా చీకటి! - భయం - కలహాలు.

తుపాకి చప్పుడు ఒక నిమిషం - నిశ్శబ్దం మళ్ళీ ! వర్షం ఉధృతంగా తయారయింది. శవం గమ్యస్థానం దగ్గర్లోనే ఉంది. మనుషులు వాళ్ళ ధర్మం విస్మరిస్తే విస్మరించారు - భయపడకన్నట్లు - నీళ్ళు !!

పూలు కదిలాయి శవం నవ్వుకుంటూ నీళ్ళపై వెళుతున్న దృశ్యం చూచే అదృష్టవంతులు లేరు.

1972

---